# సైకిల్ సవారి

"సన్యాసిరావు సైకిల్ లేచిపోయింది....!"

ప్లేట్లున్న ఇడ్లీలు సగం ఖాళీ చేసిం తర్వాత లటిక్కిన గుర్తుకొచ్చింది. ఆనందరావుకు. ఇడ్లీలు మింగుడు పడక అర్జంటుగా ప్రకటించాడా తాజా వార్తను ఆదరబాదరాగా.

సద్దాంహుస్సేన్ సన్యాసం పుచ్చుకుని హిమాలయాలకు వెళ్లాడన్నంత ఆశ్చర్యంలో ముంచెత్తిందా వార్త - నాలుగు చక్రాల బండి హోటల్ చుట్టూ మూగి టిఫిన్లు చేస్తూ కబుర్లు నంజుకుంటున్న ఉద్యోగులందరికీ.

" సైకిల్ లేచి పోవడమేమిటీ, నా బొందా! అదేమన్నా ప్రేమాయణంలో మునిగిన పసిడి బుగ్గల పడుచా? ఆఫ్టరాల్ రెండు సన్న చక్రాల సైకిల్ గదా!" పెసరట్టు భరతం పడ్తున్న షణ్ముగం జోక్ కట్ చేసాడు. అది పేలక పోయేసరికి మొహం మాడిపోయిన మసాలా దోశైంది.

నీటి పారుదల శాఖలో ఆనందరావు జూనియరసిస్టెంటు. అదే సెక్షన్‌లో షణ్ముగం సీనియరసిస్టెంటు. కరీంనగర్ పట్టణానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో దిగువ మానేరు డ్యాం నిర్మాణ, నిర్వహణకై కొన్ని ప్రభుత్వాఫీసులు వెలిశాయి. కొన్ని వందల మంది ఉద్యోగులు బిలబిలమంటారక్కడ.

వారందరికీ మధ్యాహ్న భోజనం కం ఫలహారశాల సన్యాసిరావు మోబైల్ హోటలు అనబడే నాలుగు చక్రాల బండి. తాజా సరుకులు. ధర తక్కువ-రుచి ఎక్కువ హోటల్ సన్యాసిరావు ప్రత్యేకతలు.

ఓ మారుమూల పల్లెటూళ్ళో పుట్టి పెరిగి బ్రతుకు బండి నీడ్చలేక-పొట్ట చేత పట్టుకుని, భార్యాపిల్లల్ని వెంబడేసుకుని అక్కడికి చేరిన సన్యాసి రావుకి తన తండ్రినుండి లభించిన ఏకైక ఆస్తి పాత సైకిల్. అదే అతనికి తృప్తి. దాన్నందరూ డబ్బా సైకిలన్నా, డొక్కు సైకిలన్నా బాధన్పించదు.

" ఈ ఆండెపు లొట్టల పందిరినింకెన్నిసార్లు బాగు చేయిస్తుంటావు? పాత సామాన్లవాడి కమ్మేసెయ్" అని అర్ధాంగి పద్మావతి అరవైసార్లయినా సలహా ఇచ్చుంటుంది. చెవు మీద పేను పారలేదు,

అదే సైకిల్‌కు కొత్త ట్యూబు టైర్లు వేయించి తృప్తిగా ఊపిరి పీల్చుకున్నాడు. దానిమీదే రోజూ టౌనుకెళ్ళి కావాల్సిన సరుకులు తెస్తాడు. మధ్యాహ్నానికల్లా రుబ్బిన పిండీ, ఇంట్లోనే తయారుచేసిన చట్నీలూ, ఆలుగడ్డ కూరలతోపాటు రెండు స్టౌలు వగైరాలు నాలుగు చక్రాల బండిలో కెక్కుతాయి. దాన్నే సన్యాసిరావు మోబైల్ హోటలంటారంతా.

ఆఫీసుల లంచవర్లో వేడి వేడి ఇడ్లీలు, దోశలు తయారై పైపైనే ఎగిరిపోతుంటాయి.

అందరితోనూ కలుపుగోలుగా మాట్లాడే సన్యాసిరావు దంపతులు కొందరికి పద్దులు కూడా రాస్తారు. జీతాలు రాగానే వసూలు చేసుకుంటారు.

"సైకిల్ లేచిపోయిందంటే... ఎవడో లేపుకుపోయిందు సార్!"అన్నాడు ఇడ్లీ ప్లేట్లో చట్నీ వడ్డిస్తున్న సన్యాసిరావు,

" అయ్యో పాపం! యెవ్వడు, యెక్కడ, యెలా, యెప్పుడు లేపుకు పొయ్యాడూ!?" ఖాళీ ప్లేటు పక్క అరుగుమీదుంచుతున్న భుజంగం సానుభూతి చూపించాడు - నవ్వాపుకుంటూ. ఇంతకు ముందాయన పత్రికా విలేఖరిగా పంజేశాడట.

"ఏముందన్నా!....అది పాతసైకిల్ గదాని దానికి తాళం కొనలేదు. దుకాణం ముందట పెట్టి, లోపల సరుకులు కొని బయటకొచ్చే సరికి మాయమైంది. ఎవడో పుణ్యం గట్టుకున్నాడు. ఎవరికన్నా అమ్మినా రెండొందలొచ్చేవి."

పెనమ్మీద పెసరట్టు వేస్తున్న పద్మావతి పెదాలు చప్పరించింది - గజ దొంగతనానికి గుర్తైనట్టు.

"పీడా వొదిలింది. కొత్త సైకిల్ కొనుక్కో- పోయిందాని మొహమ్మీద పేడ నీళ్లు కొట్టినట్టుంటుంది." ఆఫీసు సూపర్నెంటు కాడర్లో అనుభవం గడించిన కామేశ్వర్రావు జోకాడు. బలవంతపు బ్రాహ్మణార్థంలా నవ్వారు కొందరు. వెధవ జోకని వెర్రిగా నవ్వారు మరికొందరు.

"అది మా నాయన ఎక్కి తిరిగిన సైకిల్ సార్! అదింట్లోవుంటే మా నాయన ఉన్నట్లే అన్పించేది. ప్చ....! ఏం చెయ్యాలి సార్! నాకు బాకీ లేదు" సన్యాసిరావు మాటల్లో విషాదం, వినోదం కలెగలుపుకు పోయిసై.

"పన్లోపని....సైకిల్ బదులుగా ఓ రాజ్‌దూత్ కొనెయ్యవోయ్, పుష్పక విమానంలాగుంటుంది" ఇతరుల స్కూటర్ల మీద దర్జాగా తిరిగే లింగమూర్తి ఉచిత సలహా పారేసి కిసుక్కుమన్నాడు....చాయ చప్పరిస్తూ.

"అమ్మోయ్! కూట్లో రాయి తియ్యలేనోడు ఏట్లో రాయి తీస్తాడా? కొత్త సైకిల్ కొనలేనోన్ని స్కూటర్, సైకిల్ మోటార్లు కొంటానా!" సన్యాసిరావు తప్పుకోవడంతో నిరుత్సాహ మలుముకుంది లింగమూర్తిని.

"అండగా కాళ్లుండగా
బండెందుకూ ఇక దండగా...."

సపోర్టు విసిరాడు కవి, భావుకుడైన అనంతరాములు. పద్మావతి ముఖారవిందం విచ్చుకుంది.

"నిజం జెప్పినవన్నా—" అంది ఆలుగడ్డకూర వడ్డిస్తూ.

* * *

"సన్యాసిరావింటికి సర్కారు పోలీసులొచ్చిండ్రు!..."

అప్పుడే తలంటు స్నానం చేసి తువ్వాలుతో నెత్తి తుడుచు కుంటూ బాతూమ్‌నుండి బయటకొచ్చిన భర్త చెవిలో ఊదింది పక్కింటి పార్వతి - దేశంలోకెల్లా అతిపెద్ద రహస్యమిదేనన్నట్టు. పరమేశంకు నమ్మబుద్ధి కాలేదు. నెత్తి తుడుచుకుంటూనే బయటకు చూపులు విసిరాడు.

నిజమే... పోలీసులు ... ఇద్దరు పోలీసులు సన్యాసిరావింటి ముందు బీడీలు కాలుస్తూ లాఠీలు గాల్లో ఊపుతున్నారు.

అనుమానమేదో బుర్రను కొరికేసింది.

వెంటనే షర్టేసుకుని స్పాటు మీద కొచ్చేశాడు - ఆలస్యం అనర్థానికి

దారి తీస్తుందేమో ననుకుంటూ. గుప్పెడు చిరునవ్వును పెదాల మీదా, గ్లాసెడు ఉత్సాహం మొహమ్మీదా కుమ్మరించుకున్నాడు.

"ఏటొచ్చారండీ...." అడిగాడు సాధ్యమైనంత మర్యాదగా.

రామాయణంలో పిడకలాటలాగనిపించింది పోలీసులకు.

"మీకెందుకండీ.... ఇంతకు నువ్వెవరూ?" పొట్టి పోలీసు కానిస్టేబుల్ పొగరు పొడుచుకొచ్చింది.

"నువ్వేమన్నా...మప్టీలో వున్న మా బాసువా?" పొడుగు కానిస్టేబుల్ బూటుకాలు కింద సగం కాల్చిన బీడీ పీక నిర్దాక్షిణ్యంగా నలిగిపోతుంది. లాఠీ గాల్లో నాట్యమాడుతుంది.

పరమేశం ఉత్సాహం తుస్సుమంది.

సన్యాసిరావుకి భయం జ్వరం సోకింది. వంద కష్టాలొకేసారి ముంచు కొచ్చినట్టు ఇదైపోతున్నాడు. పద్మావతి గుండెల్లో గుండ్రాయి దొర్లుతుంది. చీకట్లో చంద్రోదయంలా కనిపించాడు పరమేశం.

"జర సూడన్నా...పోలీసోళ్ళు ఈయన్ని రమ్మంటున్నారు" వణికి పోతుంది పద్మావతి.

"ఎందుకటా...!?"

"ఏమో సార్! యస్సైసి రమ్మన్నాడంటున్నారు. ఎందుకని అడుగుదా మంటే వీపు విరగ్గొట్టేటున్నారు" విన్నవించాడు సన్యాసిరావు - పరమేశ మన్నా కనుక్కుంటాడేమోనన్న ఆశతో.

"ఎందుకు రమ్మంటాడబ్బా యస్సై? ఈ ప్రాంతంలో దొంగతనాలు, దోపిడీలు జరగలేదు. మర్డర్ కేసులుగూడా లేవు. ఏదన్నా జరిగినా సన్యాసి రావందులో తల దూర్చడు. ఎక్కడన్నా గలాటా జరుగుతూంటే ఆమడ దూరంనుండి వెళ్తాడు.... పరమేశం ఆలోచనా తరంగాల కేదీ తట్టలేదు. విధి లేని చేతులు బుర్రను తడుముతున్నాయి.

"ఇప్పుడేం జెయ్యాలె సార్...!" సన్యాసిరావు గొంతులో గూడుకట్టు కున్న దిగులు బలం పుంజుకుంటుంది.

"పోలీసు టేషన్లకు పట్టుక పోయినోల్లను దెబ్బలు కొడతారట గదా! కొందరైతే పోలీసు దెబ్బలకే చస్తారట!... ఇప్పుడేం జెయ్యాలన్నా.... ఏమై తదో ఏమో" బోరుమంది పద్మావతి.

పోలీసు స్టేషన్లో చిత్రహింసలూ, లాకప్ మరణాలూ ... పేపర్లలో

చదివిన వార్తలు పరమేశం బుర్రలో గిర్రుమంటున్నాయి. కాని.... ధైర్యం చెడితే అప్పటికే సగం చచ్చిన సన్యాసిరావు దంపతులు స్వర్గారోహణ పర్వంలో కెల్తారనే అనుమానం పొడసూపింది.

"అరే...ఇంతమాత్రానికే అంత పరేషానెందుకూ? వెళ్ళి ఏం సంగతో కనుక్కునిరా దర్జాగా! కొంపలేమి మునిగిపోవు. లా అ-డ్ ఆర్డర్ మెయింటేన్ చేసే పోలీసులకు నీ సహాయమేమన్నా అవసరమేమో! తొందరగా వెళ్ళి తొందరగా రా! వచ్చేప్పుడు సరుకులు తెచ్చుకో" సముదాయించ గలిగాడు-కడుపులోని భయం గొంతులోకి రానీకుండా.

కాలుగాలిన పిల్లి లా తిరుగుతున్న సన్యాసిరావుకూ ఓమూల నిల్చుండి ఎవరో చచ్చారన్నంతగా రోదిస్తున్న పద్మావతికీ — ఏట్లో కొట్టుకు పోయే వాడికి ఏరు దొరికి నట్టయింది.

"నేంబోయిన తర్వాత నన్నక్కడే ఉండమంటే నేనేం జెయ్యాలి?..." వేళ్ళేందుకు తయారవుతూ అనుమానం వెలిబుచ్చాడు సన్యాసిరావు,

"నువ్వెళ్ళి మధ్యాహ్నానికల్లా తిరిగి రాకపోతే నేనే స్టేషనుకొచ్చి కనుక్కుంటాలే..." అనబోయి నాలిక్కరుచుకున్నాడు.

"ఇవ్వాళ మధ్యాహ్నం నీ బండి హోటల్ కనబడక పోతే మేమంతా స్టేషనుకొచ్చి అడుగుతాం లేవోయ్" భుజం తట్టాడు.

"నువ్వేం భయపడకమ్మా... ఓ గంటలో తిరిగొస్తాడు..." పద్మావతికి ధైర్యం నూరిపోశాడు.... ఆ తర్వాత ఏం జరగాలో అదే జరుగుతుందనుకుని.

సన్యాసిరావు స్టేషన్లో అడుగు పెట్టాడు ఊపిరి బిగపట్టుకుని. అతని నాభినుండి వెలువడిన విద్యుత్తరంగ మొకటి గుండెల్లో చొరబడింది. అక్కడున్న జనాలను చూడగానే పోలీసు స్టేషనుకూ — రైల్వే స్టేషనుకూ తేడా లేదనిపించింది.

లాకప్ ఊచల్లోంచి తొంగి చూస్తున్నాయి కొన్ని ఆకారాలు."అమాయకులెందర్నో పట్టుకొచ్చి బొక్కలో తోసేశా" రనుకున్నాడు. ఖాకీ వనంలో ఖద్దరు పంచలు తిరుగుతున్నాయి. యస్సైని ముందుకెళ్ళగానే మళ్లీ గుండె గాబరా ఎక్కువైంది. అలవాటు లేనివాడు ఆగకుండా ఐదు కిలో మీటర్లు పరుగెత్తినట్టు- ఒళ్ళంతా చెమట పట్టేసింది,

"సన్యాసిరావొచ్చిండు సార్!"సెల్యూట్ చేసి పక్కకు తప్పుకున్నాయి ఎర్ర టోపీలు,

" నువ్వేనా సన్యాసిరావంటే! " యస్సై కంఠం కంచు గంటలా మోగింది.

సన్యాసిరావు వెన్నులో సన్నటి వణుకు జీవం పోసుకుంటుంది. తూటా లేని తుపాకి ట్రిగ్గర్ ఎన్నిసార్లు నొక్కినా పేలనట్టు - ఎంత ప్రయత్నించినా నోటమ్మట మాట రాలేదు.

తలూపాడు ఔనన్నట్టుగా.

అతని పరిస్థితి యస్సైకర్థమైంది కాబోలు.

"మాట్రాలావా?" సీరియస్‌నెస్ తగ్గింది.

సన్యాసిరావు భయం సగం పారిపోయింది.

"వస్తాయి సార్....కాని నేనేం తప్పు చెయ్యలేద్సార్....అమ్మతోడు...నాపిల్లల తోడు...." జోడించిన చేతులు నడినెత్తి మీదున్నాయి.

"ఈ మధ్య సైకిళ్ళ దొంగతనాలు జరుగుతున్నాయి. నీకు తెలుసా ?"

"దొంగతనమా! " దొంగతనం నెత్తిమీది కొస్తుందేమోనని హడలెత్తి

"నాకేం దెల్వదు సార్! నేను దొంగతనం చెయ్యలేద్సార్! నా సైకిలే పోయింది—ఇంక నామాట అబద్ధమైతే మా డ్యాం ఆఫీసర్లనడగండి సార్,. నేందొంగను కాద్సార్.... నన్నిడిచి పెడితే వెళ్ళిపోతా...." మళ్ళీ చేతులు పైకిలేచాయి.

"ఎందుకట్లా చలిజ్వరమొచ్చినట్టు వణికిపోతావ్? నేనేమన్నా పులినా?" మర్యాదగా అడిగిందానికి జవాబు చెప్పు.

"స....రే... సా....ర్"

" నీ సైకిల్ పోయిన మాట నిజమేనా?"

"నిజమే సార్, నామాట అబద్ధమైతే...."

"అబద్ధం గాదు, నిజమే. ఐతే పోలీసు రిపోర్టెందుకివ్వలేదూ?"

"పాత సైకిలే గదా....పోలీసులదాకా ఎందుకనీ! అదిగూడా తప్పేనా సార్?"

"కాదా మరి! సైకిలేమిటి—చిన్న చీపురు పుల్ల దొంగతనం జరిగినా పోలీసు రిపోర్టివ్వాల్సిందే. అసలూ....పోలీసులున్నదెందుకనుకున్నావ్?"

"...దొంగల్ని దొరకపట్టి, బొక్కలిరగ్గొట్టి బొక్కలో దోసేందుకు ....

"నేను దొంగను కాద్సార్! ఈసారికి తప్పు మన్నించి నన్నిడిచిపెట్టండి సార్!" వొదిలేస్తారో లేదో నన్న అనుమానం ఆందోళన రేపుతుంది.

స్టేషన్ వెనక్కు తీసికెళ్ళాడతన్ని యస్సై.

"ఈ సైకిల్ నీదేనా?" అక్కడున్న నాల్గు సైకిళ్ళలో ఒకదాన్ని చూపించాడు. సన్యాసిరావు కళ్ళల్లో కాంతి పుంజం తళుక్కుమంది. వెన్ను లోని వణుకు తోక ముడిచింది,

"నాదే సార్...ఇది నాదే సార్" సైకిల్‌ను కౌగలించుకోబోయి చేతులు వెనక్కు తీసుకున్నాడెందుకైనా మంచిదని.

"సరే బాగానే గుర్తుంది"

"అయ్యో నా సైకిల్ నాకు గుర్తుండదా? అది మా నాయన నాకిచ్చిన ఒకే ఒక ఆస్తి సార్! నాది నాకిప్పించండి సార్!" భయం స్థానాన్ని ఆశ ఆక్రమించింది.

"ఇప్పిస్తాం. కాని యిక్కడ కాదు, కోర్టులో. అక్కడ గూడా గుర్తు బడితేనే ఇప్పిస్తాం."

"ఎప్పుడు సార్!"

"రేపు కోర్టుకు రా!"

"సరే సార్!" పాలపొంగు మీద నీళ్లు చల్లినట్లైంది.

* * *

సన్యాసిరావు అడుగు కోర్టు ఆవరణలో పడింది. అడవి జంతువులమధ్య నడుస్తున్నట్టనిపించింది. తన సైకిల్ తన కొస్తుందనే సంతోషంతోపాటు కేసు ఎటునుండి ఎటొస్తుందనే భయంగూడా పీక్కు తింటుంది.

"దొంగ తరపు ప్లీడరేమడుగుతాడో...ఎన్ని చిక్కు ప్రశ్నలేస్తాడో— నేనే దొంగనని జైలుకు పట్టిస్తే?" అంతరంగ చిత్రం మొహమ్మీద దోబూచు లాడుతుంది.

మధ్యాహ్నమైంది. ఆత్మారాముడు అల్లరి పెడుతున్నాడు. ఆ రోజు సరుకులు తీసికెళ్ళనందున వ్యాపారం హుళక్కి.

యస్సైముందు నిల్చొండి

"నా సైకిల్ చూపించుండ్రి సార్! గుర్తు బట్టి తీస్కపోతా. ఇంటిదగ్గర నాకు శానా పనుంది" చేతులు జోడించబోయాడు.

"ఇది కోర్టా మజాకా? ఆగు. ఆకలైతే హోటల్ల భోంచేసిరా!" పోలీసు పొంగు సురసురమంది.

నాలుగు మెతుకులు గతికి హోటల్లో పదిరూపాయల బిల్లు చెల్లిస్తుంటే

ఉసూరుమంది ప్రాణం. దోపిడీకి గురౌతున్నాననుకున్నాడు. నాలుగు గంటల కొచ్చింది కేసు విచారణకు.

దొంగ యింకా ప్లీడర్ను పెట్టుకోలేదట. కేసు వాయిదా పడింది. నరాన్ని కొత్తబ్లేడుతో కోసి కుప్పలు పెట్టినట్టనిపించింది.

మరో రోజు దొంగ ప్లీడర్ను పెట్టుకున్నాడని ప్రకటించి వాయిదా వేశారు.

ఇంకోరోజు పోలీసు డిపార్టుమెంటు తరపున ఎవ్వరూ రాలేదని కేసు వాయిదా పడింది.

నాల్గోసారి దొంగ పెట్టుకున్న ప్లీడర్ను పీడిస్తున్న జ్వరం కేసు విచారణ కాటంకమైంది.

ఐదోసారి... పోలీసు ప్లీడరు తల్లి చనిపోయింది.

ఆరోసారి .... హైకోర్టు జడ్జి హరీమన్నాడట. కేవలం సంతాప సభ జరిగింది. లాయర్లు కోర్టుకు రాలేదు. బార్‌లోనే ఉండిపోయారు.

ఏడోసారి భారత్ బంద్.

ఎనిమిదోసారి జడ్జిగారు క్యాజువల్ లీవులో...

కేసు వాయిదాలు తింటూనే వుంది. ప్రతీసారి సన్యాసిరావొచ్చి సగం చచ్చి వెల్తూనేవున్నాడు. కోర్టులో హాజరైనరోజు వ్యాపారం మూతపడుతుంది.

వ్యాపారం నడిచిన రోజైనా...మంత్రి పదవూడిన ఎమ్మెల్యే ఇల్లులా గిరాకి రాను రాను సన్నబడుతుంది,

" ఏందయ్యా, నువ్వు కోర్టు చుట్టూ తిరుగుతుంటివి, సరుకులు తేక పోతివి గిరాకులు పల్చబడుతూండె. పాత సైకిల్ వచ్చినా లాభమేముంది-గిరాకులు రానప్పుడూ!" పద్మావతి మందలించిందోరోజు.

అదే రోజు మధ్యాహ్నం...

ఎప్పుడూ తన ఇడ్లీల కోసం అరమైలు దూరాన్నుండి పరుగెత్తుకొచ్చే గిరీశం తనను దాటేసి వెల్తున్నాడు.

"గిరీశం సార్...సార్సార్...ఇడ్లీలు తయార్ సార్!" కేకేశాడు సన్యాసి రావు.

ఓ చిరునవ్వు పారేసి ముందు హోటల్లో దూరాడు గిరీశం. గుండెనెవరో రాక్షసి గోళ్ళతో గోకినట్టయింది. గిరీశం తిరిగి వచ్చేప్పుడాపి అడిగాడు.

"ఏం సార్! నా బండి హోటల్ సరుకు చేదయిందా?"

"బాగానే వుంది... కాని ... నేనేమో పద్దురాసి తింటాను- నెలకోసారి డబ్బు లిస్తానన్న సంగతి నీకు తెల్సు, నువ్వేమో వారానికోరోజు మాయమౌతున్నావ్. నీ బండి రెస్టు తీసుకుంటుంది. ఆరోజు నేను నిలారమేగదా!" జవాబు కోసం ఎదిరిచూడకుండా దూసుకెళ్ళాడు.

రెండు చెంపలొకేసారి ఛెళ్ళుమన్నట్టయింది.

నిజమే...పద్దులు రాసే గిరాకులు చాలా తగ్గాయి. నగదు గిరాకీ డబ్బులతో రోజువారీ సరుకులు కొనటం ... నెల నెలా వసూలయే పద్దుల డబ్బులు ఇంటి అద్దెకూ, ఇంట్లోకి కావలసిన సరుకులకూ సరిపోయేవి. కాస్తో కూస్తో ఆదా అయేది. మరిలా పద్దుల గిరాకీలు తగ్గిపోతే ఎట్లా...?

భవిష్యత్తు చీకటి భయంకరంగా కన్పించింది. అంతరంగంలో భూకంపం బద్ధలైంది.

* * *

"సన్యాసిరావింటికి మళ్లీ పోలీసులొచ్చారు..."

ముంగిట వేస్తున్న ముగ్గునాపి బుట్టతో సహా లోపలికి పరుగెత్తింది- పది పదుల కిలోల బరువున్న పార్వతి. పరుగెత్తి బుగ్గలు నొక్కుకుంటూ చెప్పింది భర్తతో - కంగారు రంగరించి.

"నోర్మయ్" టూత్ పేస్టుతో తంటాలు పడుతున్న పరమేశం.

"ఆయన తంటాలేవో ఆయన పడతాడు...మనకెందుకూ...గాలికిపోయే కంపను వీపుకు తగిలించుకోవడమెందుకూ...?" ఎడమ చేత్తో పెళ్ళాం నోరు మూసినంత పనిచేశాడు.

" అదెట్లా... ఇరుగూ పొరుగూ అన్నప్పుడు ఆమాత్రం సాయం చెయ్యకపోతే... రేపు మనకేదన్నా ఆపద వస్తే..."

భార్య మాటలు కర్ణకఠోరాలన్పించి భర్త యమస్పీడుగా బాత్రూంలో చొరబడ్డంచేత ఆవిడ మాటల్ని బాత్రూం తలుపులు మాత్రమే విని ఆనందించాయి.

ఇద్దరు కానిస్టేబుళ్ళు నిలదీస్తున్నారు సన్యాసిరావును.

"మొన్న కోర్టుకెందుకు రాలేదోయ్?"

"ఏ ఊరికన్నా దావతుకు వోయినావా?

కుడితిలో పడిపోయిన ఎలుకలాగైపోయిన సన్యాసిరావుకేం చెప్పాలో తోచలేదు. రెండు చేతుల్తో బుర్ర గోక్కుంటూ భూమ్మీద కూచుండిపోయాడు.

"మాట్లాడవేంరా సన్యాసీ?" మీసాల పోలీసు లాఠీ గాల్లోకి లేవబోయింది

"మొన్న అందరూ వచ్చింర్రు. నీ సైకిల్ గూడా వచ్చింది కోర్టుకు. బుద్ధి తక్కువై నువ్వే రాలేదు. యస్సైను నిన్ను రమ్మన్నాడు పద!" రెక్క బట్టి లేవబోయి మానుకున్నాడు పేడు మూతి పోలీసు. లోపల్నుండి పద్మావతి తారాజువ్వలా పరుగెత్తుకొచ్చింది-ముక్కు పుటాలెగిరేస్తూ.

"ఆగుంర్రయ్యా! మా ఆయన ఎక్కడికీ రాడు. ఇప్పటికే మా గిరాకీ దెబ్బతిన్నది. ఇంక కొన్ని రోజులు మారాజు గిట్లే తిరిగితే మా పోరగాండ్లూ మేమూ బిచ్చమడుక్కుని తినాలే..." భర్త కడ్డంగా నిల్చుంది - మొండి ధైర్యం ముంచుకొచ్చి.

అనుకోని దేదో జరుగబోతుందనిపించింది కానిస్టేబుళ్ళకు.

"మీరు పోంర్రన్నా... మా మానాన మమ్ముల్ని బతుకనియ్యింర్రి!" దండం బెట్టింది.

లాఠీలు రెండు దూరం జరిగి నిల్చున్నాయి నిశ్చేష్టంగా.

"మరి...మీ సైకిల్ మీ కొద్దా?..." మీసాలు విచిత్రంగా మెలికలు తిరిగాయి.

"సైకిలొద్దూ, గైకిలొద్దు. సైకిల్‌కోసం తిరుగుతూంటే మా బతుకులు బజార్ల పడుతై-ఉన్నదిపోతదీ, ఉంచుకున్నది మూతిమీదతన్ని పోద్దన్నట్టు మీరు పోంర్రన్నా!"

పద్మావతి కళ్ళపై కమ్మిన నీటి తెర ఏవో భావాల్ని కుమ్మరిస్తుంది. మరెన్నో కథలు చెబుతుంది.

చెరో మూలకు దాగున్న మూడేళ్ళ బాబు, నాలుగేళ్ళ పాప ఏడుస్తూ వచ్చి తల్లికి చెరోపక్క నిల్చున్నారు.

* * *

సన్యాసిరావింటికి పోలీసు జీబొచ్చింది. యస్సై బూట్లు సన్యాసిరావింట్లో టక టక మన్నాయి.

"నమస్తే సారూ!" సన్యాసిరావు గుండె లట లట లాడింది.

"మొన్న మా జవాన్లను పంపిస్తే రాలేదెందుకూ? కోర్టులో సాక్ష్యం చెప్పి దొంగకు శిక్షపడేందుకు ముందుకు రావాల్సిన బాధ్యత నీది, తెల్సా?" పోలీస్ పవర్‌లో రవ్వంత మర్యాద, కాసింత బుజ్జగింపూ, బోలెడంత బెదిరింపూ కలిసున్నాయి.

సన్యాసిరావు ఉక్రోశం ఉరకలాడింది.

"నేను కోర్టుచుట్టూ తిరుగుతూంటే నా యాపారం దెబ్బతింది. గిరాకులు పడిపోయినై. నా సైకిల్ పోతేపోయింది... ఇంకేదో అనబోయాడు.

గూబ గుయ్యిమంది.

"నాన్సెన్స్! ఆ సుద్దులన్నీ చెప్పొద్దు. పోలీసు కేసా, తంట మజాకా? ప్రతివాడూ ఇట్లా అంటూంటే దొంగల్ని జైల్లకెట్లా పంపించాలె? దొంగతనం జరగిందని దరఖాస్తు పారేసి మీ జాగల మీరుంటారు. దొంగ బాడ్కావులు తప్పించుకుపోతారు-సాక్ష్యం దొరకక నడుమ మేం ఛస్తున్నాం... అవన్నీ నాకు జెప్పొద్దు. రేపు కోర్టుకురా!"

యస్సైని వ్యవహారం పద్మావతి గుండెల్లో గుండు సూదులు దిగేసింది. కళ్ళు తడై కపోలాలను సిలదీస్తున్నాయి. జాగృతమైన ఉడుకుమోత్తనాన్ని నిస్పృహాయత అణచేస్తుంది.

చప్పున యస్సైని కాళ్ళమీద పడిపోయింది. విచ్చుకుపోయిన తల వెంట్రుకలు బూటు కాళ్ళను కప్పేశాయి.

"వద్దన్నా నీ కాల్మొక్కుత. ఆయన రాడు. సైకిల్ పోతే పోయింది."
గోడు పూర్తికాలేదు. బూటుకాలు బుద్ధి పోనిచ్చుకోలేదు.

పద్మావతి పక్కకు పడిపోయింది.

"అవన్నీ నడువవ్! నేనేమీ వినను. సన్యాసిరావూ! రేపు కోర్టుకు రాక పోతే ఎల్లుండి నీ పంజూపిస్తా...!"
పళ్ళు పట పట లాడిస్తూ వెళ్ళిపోయింది పోలీసు జీపు.

బాధనంతా కుత్తుక చెరసాలలో బంధించి సన్యాసిరావు కోర్టు కెళ్ళి సాక్ష్యం చెప్పాలనే నిర్ణయించుకున్నాడు.

పద్మావతి గూడా వెళ్లిరమ్మంది - విధిలేక.
బిక్కు బిక్కుమంటున్న పిల్లల్ని కొత్తగా చూస్తూ బయల్దేరాడు.

* * *

సైకిల్ కోర్టుకొచ్చింది. బోనులో నిల్చున్న సన్యాసిరావు ముందుంది. సైకిల్‌ను చూడగానే అతని కళ్ళల్లో వింత కాంతి .... ఏదో దివ్యానుభూతి అలుముకుంది.

"ఈ సైకిల్ నీదేనా?" అడిగాడు పోలీస్ ప్లీడర్.
ఒళ్ళంతా కళ్లు జేసుకుని చూస్తున్నాడు సన్యాసిరావు.

....సైకిల్ తనదే....కాని బెల్లు మాయమై బోసిగా ఉంది. స్టాండ్, డైనమాలు కనబడ్డం లేదు. కొత్తగా వేయించిన టైర్ల స్థానంలో తూట్లు పడ్డ టైర్లు, తూట్ల నుండి తొంగిచూస్తూ సన్యాసిరావును వెక్కిరిస్తున్న ట్యూబులు. రోజూ తూడుస్తూ ఆయిల్ వేస్తుంటే ధగ ధగా మెరిసే రీములు - తుప్పుబట్టు న్నాయి.

అప్పుడే అలంకరించుకున్న ఆడపిల్లలా కన్పించే సైకిల్ క్షయ వ్యాధితో బాధపడుతున్న ముసల్దానిలా తయారైంది.

"ఏమయ్యా చెప్పూ! ఈ సైకిల్ నీదేనా?" పోలీస్ ప్లీడర్ గొంతుస్థాయి హెచ్చింది.

సైకిల్ అవతారం నాన్నను గుర్తు చెయ్యడంలేదు. ఆగర్భ శత్రువులా కనబడుతూంది. యస్సైని కొరికెయ్యాలనిపిస్తుంది.

సన్యాసిరావు పళ్లు బిగుసుకు పోతున్నాయి,

కంటి రెప్పలు పైకి లేచాయి - తపస్సు చాలించిన సన్యాసిలా.

ఎదురుబోనులో

"తప్పైపోయింది గురూ..." అన్నట్టు కళ్లు తిప్పాడు దొంగ.

" ఈ సైకిల్ నాదిగాదు " నిర్ణయం పలికింది. *

(కథాంజలి మార్చి 93, ఏప్రిల్ 93. & జూన్ 93)